తలుపు కొట్టిన చప్పుడయితే వెళ్లి తలుపు తీశాడు చలపతి. ఎదురుగా రాజ్యం!

తనకు అత్యంత ఆత్మీయ స్నేహితుడు రాజశేఖరం కూతురు.

# కథ

''నిర్మల ఏం చేస్తున్నది అంకుల్?'' అన్నది కంగారు కంగారుగా తలుపు తీసిన చలపతిని చూస్తూనే.

''లేదమ్మా. వాళ్లత్తయ్య వాళ్లింటికి వెళ్లింది మొన్న సాయంత్రం. రెండ్రోజులు సెలవులు వస్తే ఇంట్లో వుండదు కదా అది!''

''దిల్‌సుక్‌నగర్ ఆంటీ వాళ్లింటికేనా?'' అడిగింది ఆదుర్దాగా.

''అవును. ఏమిటి హడావుడి? ఎందుకు అదోలా వున్నావు? అంతా కులాసానా? లోపలకు రా'' అంటూ వెనుతిరిగాడు చలపతి. సోఫాలో కూర్చుంటూ ''ప్రొద్దున్నే ఏం ప్రోగ్రాం వేసుకున్నారేం. అది లేదనేట ప్పటికి నీరసపడిపోయావు!'' అన్నాడు నవ్వి.

రాజ్యం తల వంచుకుని నిలబడింది. ''అది వుంటుందేమోనని ఆశగా వచ్చాను అంకుల్. సునీత వాళ్లింటికి వెళితే అది కూడా లేదు.''

''అంటే సెలవురోజున ఒక్కదానివే అయ్యావన్న మాట. అదా నీ దిగులు. నాన్న ఏం చేస్తున్నాడు? కన బడి వారం రోజులయింది. సాయంత్రం ఇంటికి రమ్మ న్నానని చెప్పు.''

''అదికాదు అంకుల్. నాకు మీ హెల్ప్ కావాలి'' అన్నది తల వంచుకుని. ''సమయానికి నిర్మల లేదు, సునీత లేదు!''

''ఏ విషయంలో?'' ఆశ్చర్యంగా ఆ అమ్మాయి ముఖంలోకే చూస్తూ అడిగాడు చలపతి.

రాజ్యం మాట్లాడలేదు. బేలగా చలపతి ముఖం లోకి చూస్తూ వుండిపోయింది.

చలపతి భార్య అరుంధతి చీర కొంగుకు తడి చేయి తుడుచుకుంటూ లోపలినుంచి వచ్చింది ''ఏమే రాజ్యం! ఈమధ్య నువ్వు బొత్తిగా కనబడడంలేదు'' అంటూ.

''ఎక్కడికీ వెళ్లడంలేదు ఆంటీ. ఇంట్లోనే వుంటు న్నాను'' అన్నది.

> ''అదికాదే రాజ్యం ఇది చిన్నపిల్లల ఆట అనుకున్నావుటే. మీ నాన్న ఎలాంటివాడో నీకు తెలుసు. మీవాళ్లంతా గుంభనంగా ఎంత మంచి పేరుతో బ్రతుకుతున్నారో నీకు తెలుసు. నువ్వు చేద్దామనుకుంటున్న ఈ పని మీ ఇంటిని ఎంత అస్తవ్యస్తమవుతుందో చదువుతున్న నీకు తెలియదుటే!''

''ఏం అలా వున్నావు? ఒంట్లో బాగుండలేదా?''

''అదేం లేదు ఆంటీ!''

''చెప్పమ్మా. ఏంటి సంగతి'' అన్నాడు 'విచి త్రంగా ఆ అమ్మాయినే చూస్తూ చలపతి.

''నేను...నేను'' తడబడింది రాజ్యం.

''నువ్వు...ఏమైంది?'' చలపతికి ఆతృత పెరి గింది. ఏమై వుంటుందబ్బా అంతగా భయపడుతు న్నది. ఇంట్లోగానీ ఏ విషయంలోనైనా తిట్టారా? ఆమె దగ్గరగా వచ్చి అనునయిస్తున్నట్లుగా ఆమె భుజం మీద చేయివేసి అన్నాడు- అసలే రాజశేఖరం చాద స్తుడు.

''నేను ఇవ్వాళ పెళ్లి చేసుకుంటున్నాను

# అసలు సంగతి

అంకుల్!''

అదిరిపడినట్లుగా ఆ అమ్మాయి ముఖంలోకి చూసాడు చలపతి. అతడు ఏమీ అర్థంకాని అయోమ యంలో పడిపోయాడు.

''ఏమిటే నువ్వంటున్నది?'' ఆదుర్దాగా ముందుకు వచ్చింది అరుంధతి.

రాజ్యం మాట్లాడలేదు. వాళ్లి ద్దరి వంకా మార్చి మార్చి బిత్తర చూపులు చూడసాగింది. భయంకరమైన నిశ్శబ్ద మేర్పడింది ఆ గదిలో వాళ్ల నడుమ.

''ఏమిటి మాట్లాడవేం? ఇంట్లో తెలుసా?'' అరు స్తున్నట్లుగా అన్నది అరుంధతే ఘల్లీ.

రాజ్యంకు కళ్ళమ్మట నీళ్ళు గిర్రున తిరిగాయి. రెండు చేతులలోనూ మొఖాన్ని దాచుకుంది.

చలపతి భార్యను కసురుకున్నాడు.

''నువ్వూరుకో. అసలే అది భయడుతుంటే మధ్యలో నీ అరుపులేమిటి? వెళ్లి మా ఇద్దరికీ కాఫీ కలుపుకు రా...పో!''

''ఏమిటి నన్నంటారు? అదేం మాట్లాడు తున్నదో అర్థమవుతోందా మీకు? పెళ్లి చేసు కుంటున్నదట పెళ్లి. పెద్దవాళ్ళు చేస్తున్నదయితే మనకు తెలియకుండా వుంటుందా? అంటే?'' సాగదీ స్తున్నట్లుగా ఆగింది.

''నేను నిన్ను లోపలకు వెళ్లమన్నానా?'' అరిచాడు చలపతి.

ఆమె ఒక్కసారి తల విదిలించి మూతి తిప్పు కుంటూ లోపలకు వెళ్లిపోయింది.

''వీళ్ళు పిల్లలు కాదు, పిడుగులు. చదువులు చదువుతున్నారుకదా బోడి చదువులు.''

రాజ్యం సోఫాలో ముడుచుకు కూర్చున్నది.

చలపతి ఆ అమ్మాయి పక్కగా కూర్చుంటూ ''చెప్పమ్మా! అసలు సంగతేమిటి? భయపడకుండా అన్నీ చెప్పు. నేనున్నానుకదా!'' అన్నాడు అనునయిస్తు న్నట్లుగా.

''అదికాదు అంకుల్'' తలెత్తి తడుస్తున్న కళ్లతోనే చలపతి ముఖంలోకి చూసింది. ''కుమార్ చాలా మంచివాడు అంకుల్!''

''నాకు తెలుసమ్మా. అతడు మంచివాడు కాక పోతే నువ్వు ప్రేమించేటంత తెలివి తక్కువదానివి కాదు. ఇంతకీ ఎవరా అబ్బాయి? ఎక్కడుంటాడు? ఏమైనా ఉద్యోగం చేస్తున్నాడా? లేక ఇంకా చదువుకుం టున్నాడా'' అంటూ ఆ అమ్మాయి ముఖంలోకి చూచాడు సౌమ్యంగా.

''రాజశేఖరంగారని బిజినెస్ చేస్తుంటారు అంకుల్, వాళ్ల నాన్న. వాళ్ళు హిమయత్‌నగర్‌లో వుంటారు. నాకంటే కుమార్ రెండేళ్ళు సీనియర్. అత డికి ఉద్యోగం చేయాల్సిన అవసరంలేదు'' అన్నది చిన్నగా.

''మరింకేం. నాన్నకు భయమైతే అమ్మకు చెప్పు. ఇందులో ఇబ్బంది ఏమున్నది?''

''అదికాదు అంకుల్. కుమార్‌ది మన కులం కాదు. అందుకే భయంగా వున్నది'' నసుగుతున్న ట్లుగా అన్నది.

చలపతి ముఖం గంభీరంగా మారింది. గుండె ల్లోంచి కోపం ఎగతన్నుకొచ్చింది.

''ఈ విషయం నీకు ముందు తెలియదా? నాన్న ఎట్లా ఒప్పుకుంటాడనుకున్నావు?'' అన్నాడు విసు రుగా.

రాజ్యం మాట్లాడలేదు. కళ్లనీరు కుక్కుకుంటూ తల వంచుకున్నది.

''ఏం మాట్లాడవ్?''

''నిజమే అంకుల్. కానీ అతడు చాలా మంచి వాడు అంకుల్. అందుకే...అందుకే'' ఇంకేం మాట్లా డాలో తెలియనట్లుగా ఆగిపోయింది. చటుక్కున్న తన చేతిని ఆయన చేతిమీద వేసింది. ఎర్రని సన్నని ఆమె చేతివేళ్ళు వణుకుతున్నాయి. ''ఎలాగైనా మీరు నాన్నని ఒప్పించాలి అంకుల్!''

చలపతి ఏం మాట్లాడాలో అర్థం కానట్టుగా ఆ అమ్మాయి వంకే చూస్తూ వుండిపోయాడు. తన కళ్ల ముందే తప్పటడుగులు వేసి తిరిగిన ఆ అమ్మాయి ఇప్పుడు తప్పటడుగులు వేస్తుంటే ఏంచేయాలో అర్థం కానట్టుగా చూస్తున్నాడు.



ఒకవైపు ఆ అమ్మాయి మీద కోపం, కన్నీళ్లు కారుస్తున్న ఆ ముఖం మీద జాలి, ఆ కుటుంబ గౌరవం గురించిన ఆలోచన. దారి దొరకడంలేదు.

ఉన్నట్టుండి ''ఆ అబ్బాయి వాళ్లింట్లో తెలుసా?'' అన్నాడు.

ఆ అమ్మాయి సమాధానం చెప్పేలోగానే అరుంధతి ట్రేలో మూడు కాఫీ కప్పులు పెట్టుకుని లోపలి నుంచి వచ్చింది.

''అదికాదే రాజ్యం ఇది చిన్నపిల్లల ఆట అనుకున్నావుటే. మీ నాన్న ఎలాంటి వాడో నీకు తెలుసు. మీవాళ్లంతా గుంభనంగా ఎంత మంచి పేరుతో బ్రతుకుతున్నారో నీకు తెలుసు. నువ్వు చేద్దామనుకుంటున్న ఈ పని మీ ఇంటిని ఎంత అస్తవ్యస్తం చేస్తుందో చదువుకున్న నీకు తెలియదుటే ఆమాత్రం!''

''అది కాదు ఆంటీ'' బేలగా ఆమె ముఖంలోకి చూస్తూ ఉండిపోయింది.

''నువ్వు ఏమైనా చెప్పు. ఈ పని మాత్రం ఏమీ బాగాలేదు!'' నిరసనగా అన్నది అరుంధతి.

చలపతి నోరు విప్పాడు.

''సరే! నేనిప్పుడు ఏం చేయాలంటావ్?'' అన్నాడు చిన్నగా.

రాజ్యం ఆశగా ఆయన మొఖంలోకి చూచింది.

''మీరే ఎలాగైనా నాన్నను కన్విన్స్ చేయాలి అంకుల్. మీ మాటంటే నాన్న కాదనడు'' అన్నది చిన్నగా.

''నువ్వు మాత్రం ఈ పెళ్లి చేసుకోవడం మాననంటావ్!'' విసురుగా అన్నాడు చలపతి.

రాజ్యం ఒక్క క్షణం ఆగింది. తల వంచుకుని ''మామూలు పరిస్థితుల్లో అయితే మానేదాన్నేమోగానీ నేను అయిదారు నెలల్లో తల్లిని కాబోతున్నాను. నాకు మరో దారి లేదు'' అన్నది ముఖాన్ని వాళ్లకు చూపలేనట్లుగా రెండు చేతుల్లో దాచుకున్నది.

చలపతి ఆ విషయాన్ని భరించలేనట్టుగా చటుక్కున లేచి నిలబడ్డాడు. అరుంధతి అసహ్యంగా ఒకసారి ఆ అమ్మాయివంక చూచి అక్కడనుంచి వడివడిగా వెళ్లిపోయింది లోపలకు.

చలపతి కళ్ళు మూసుకున్నాడు. రాజశేఖరం రూపం కళ్లముందు కదలాడింది. 'నన్నిప్పుడేం చేయమంటావురా?' అన్నట్లుగా బేలగా తనవంకే చూస్తున్నట్లు అనిపించగా డీలాపడిపోయాడు.

**పి. ఎస్. నారాయణ**

ఒకసారి తలెత్తి తన మిత్రుడి నెత్తిన కణకణలాడే నిప్పుల కుంపటి పెట్టిన రాజ్యం వంక ఏహ్యంగా చూచాడు.

ఇప్పుడేం చేయాలి? వాడికీ విషయం చెబితే భరించగలడా? రాజ్యాన్ని ఎంత ప్రేమగా పెంచాడో తనకు తెలుసు. దాని కోరిక నాలిక మీద ఉండగానే తను డబ్బుకి ఇబ్బంది పడుతున్నా వెనుకా ముందూ చూడకుండా తీర్చేవాడు.

తను వారిస్తుంటే ''ఎన్నాళ్ళురా మహా వుంటే ఇంకో రెండేళ్ళు, మూడేళ్ళు నా దగ్గరుంటుంది. తరువాత దాని మొగుడు, దాని సంసారం, దాని పిల్లలు. ఎప్పుడైనా చుట్టపు చూపుగా వచ్చి వెళ్లటమే కదరా నా దగ్గరకు'' అనేవాడు నవ్వుతూ.

అదీ బుద్ధిమంతురాలే. ఏమైందో వున్నట్టుండి ఈ రోగం పుట్టింది. నేటి చదువులే కారణమా దీనికి?

ఆకాశం మీద అట్టముక్కల్లా అంటించిన తెల్లటి మబ్బులు. వాటికంటూ ఒక రూపం లేకపోయినా మనం ఊహించుకునే రూపాల్లోనే మనకు కనబడ తాయి.

వెనగ్గా వచ్చి నిలబడింది రాజ్యం. తల తిప్పి చూస్తే ఆ అమ్మాయి కళ్లమ్మట నీరు ధారగా కారుతు న్నది.

''నువ్వు తొందర పడకుండా ఉండాల్సింది. అసలు నీకు అతడితో పరిచయం ఎలా అయింది?'' అన్నాడు నీరసంగా.

''నాలాగానే అతడు పుస్తకాల పురుగు. రోజూ కాలేజీ లైబ్రరీలో కలుస్తుండేవాళ్లం.''

చలపతి చిన్నగా అన్నాడు.

''నా దగ్గరకంటే మీనాన్న దగ్గరకు వెళితేనే బాగుం డేది'' గొణుగుతున్నట్లున్నది ఆ కంఠం. ఈ రొంపిలో తను ఇరుక్కుని మిత్రుడు రాజశేఖరంతో చీవాట్లు తినడం ఇష్టం లేనట్లుగా.

ఒక్కక్షణం ఆలోచిస్తున్నట్లుగా ఆగింది రాజ్యం.

''నిజమేగానీ అంకుల్. నాన్నకు బిపి, ఆపైన షుగర్. నేను వెళ్లి ఆయన ఎదుట నిలబడి మీకు చెప్పి నట్లుగానే చెప్పాననుకోండి. అవి రెండూ పెరిగిపోయి ఇంట్లో పెద్ద తుపానే రేగుతుంది. అంటే అసలు సమ స్యకు పరిష్కారం కంటే ఆవేశకావేషాలే ముందుకు దూసుకువస్తాయి. మీరు చెబితే అలాకాదు అని కాదు. నేను చెప్పిందానికి, నన్ను అర్థం చేసుకున్న మీరు చెప్పిందానికి చాలా తేడా వుంటుంది. నేను ఎదురుగా నిలబడి మాట్లాడుతుంటే పెద్దవాళ్లకు మండుతున్న కట్టెల్ని ముందుకు తోస్తున్నట్లుగా వుంటుంది. దాన్ని భరించలేక ఏదైనా జరగకూడనిది జరిగిందను కోండి!'' ఆమెకు ఇక మాటలు పెగలనట్లుగా గొంతు దుఃఖంతో కొన్ని క్షణాలు పూడుకుపోయింది. పెగల్చు కుని ''పోనీలెండి అంకుల్. నాన్న బాధపడడం నేను భరించలేను. నేనే ...నేనే ఏదో ఒకటి చేసేస్తాను. నన్ను కని పెంచి పెద్దచేసిన వాళ్లకు క్షోభ పెట్టేకంటే నా జీవితా నికి ఇదే ఆఖరి రోజు అనుకుంటాను. ఏ సమస్యా వుండదు. వాళ్ళూ ఒక ఏడుపు ఏడ్చి ఊరుకుంటారు'' అన్నది దుఃఖాన్ని ఇక నిగ్రహించుకోలేనట్లుగా బావురుమన్నది. అంతేకాదు, ఆమె నొక్కి నొక్కి చెప్పిన ఆ మాటల్లో బాధ వున్నది. భయం వున్నది, దిగులు వున్నది. స్థిర నిర్ణయం వుంది. ఆయనను సహాయం చేయడానికి ముందుకు రాకపోతున్నందుకు నిష్ఠూరత వున్నది.

రాజ్యం తన నిర్ణయాన్ని అంత స్పష్టంగా చెప్పిన తరువాత చలపతి ఇంకేం ఆలోచించలేకపోయాడు. ఆమెకు ఉపశమనం కలిగించాలన్నట్లుగా ఆమె భుజం మీద చేయి వేసి నొక్కాడు.

కూతురు మరో కులస్థుడ్ని పెళ్లి చేసుకున్నదీ అనే దానికంటే మరి ఇక ఆమె లేదూ అనేది ఆ తల్లిదండ్రు లకు భరించలేని నిజమే అవుతుంది. దాన్ని ఎవ్వరూ కాదనలేరు.

కొన్ని క్షణాలు అలాగే వుండి ''మరి అబ్బాయి తల్లిదండ్రులు పేచీ పెట్టడంలేదా. నేను అడిగిందానికి నువ్వు సమాధానం చెప్పనేలేదు'' అన్నాడు చలపతి.

''లేదు అంకుల్. నేను స్వయంగా విన్నాను వాళ్ల మాటలు. 'చూడమ్మా నాకు డెబ్బై ఏళ్ళు. ఆంటీకి అరవై అయిదు. మేం మహా వుంటే ఇంకో అయి దేళ్ళు, పదేళ్లు. మా ఈ కొద్ది జీవితంలో మా మాటే నెగ్గాలని మేం పట్టుబట్టి కూర్చునేదానికంటే చిన్నపి ల్లలు మీకు జీవితం ఎంతో వుంది. మీకు భవిష్యత్తు ఎంతో ఉంది. ఇద్దరు చదువుకున్నవాళ్ళు, తెలివిగల వాళ్ళు. మీ సుఖమే మా సుఖం. మీ ఆనందమే మా ఆనందం. మీకు ఏది మంచిదని తోస్తే ఈ వయసులో వున్న మాకూ అదే మంచిది అని అనుకోవడమే మాకు ఆనందం. మీ వాళ్లకు అభ్యంతరం లేకపోతే మాకూ అభ్యంతరంలేదు' అని అన్నారు అంకుల్'' అన్నది తల వంచుకుని రాజ్యం చిన్నగా.

ఇక తనుగానీ, బీపీ పెంచుకునే ఆమె కన్నతండ్రి గానీ చేసేదేముంది? ఎవరైనా ఏమీ చేయలేని స్థితే ఇది.

పెళ్లి వాళ్లిద్దరి నెత్తినా ఇన్ని అక్షింతలు చల్లడమే ఉత్తమం. లేదా అది ఏ అఘాయిత్యం చేసినా భరించ గల శక్తినైనా సమకూర్చుకోవాలి.

రెండో దానికంటే మొదటిదే మేలు అనిపించగా చలపతి వెళ్లి వంకెన వున్న చొక్కా తీసి తొడుక్కున్నాడు.

అరుంధతి లోపలినుంచి విసురుగా వచ్చింది.

''అంటే రాయబారానికే బయల్దేరారన్నమాట!''

''ఏం చేయమంటావు చెప్పు. చూస్తూ చూస్తూ రాజ్యాన్ని పోగొట్టుకుంటాడా రాజశేఖరం? వాడు కాదు ఎవరైనా ఆ పరిస్థితుల్లో ఏం చేస్తారు?''

రాజ్యం వాళ్లవైపుకు అడుగువేసింది.

''మూడో మనిషి అయితేనే ఆవేశపడకుండా ఆలో చిస్తారని, సరైన నిర్ణయం తీసుకుంటారనేది నిజం అంకుల్. అందుకనే నేను మీ దగ్గరకు వచ్చింది. మీరు కన్విన్స్ అయితే నాకు ధైర్యం. అంతే!''

''నేను నువ్వు చేస్తున్న ఈ వెధవ పనిని అంగీకరిస్తు న్నట్లు కాదు. నేను మీ ఇంటికి బయలుదేరుతున్నాను. అంటే ఇంతకుమించిన మరో దారిలేదు కనుక ఒప్పు కుంటున్నాను. ఆ కాబోయే మామగారు చెప్పనే చెప్పా డుకదా...మేం ముసలివాళ్లం, ఇంకెన్నాళ్ళు బ్రతు కుతాం అని? మీ ఏడుపేదో మీరు ఏడవండని...ఆ మాటే నీకూ వర్తిస్తుందిరా అని మీ నాన్నకూ సర్దిచెబు తాను. అరుంధతీ! నువ్వూ బయలుదేరు. అక్కడ వీళ్లమ్మ ఏం గొడవ చేస్తుందో!''

''నేను రాను'' పెద్దగా అరిచింది అరుంధతి.

చటుక్కున రాజ్యం క్రింద కూర్చుని ఆమె రెండు కాళ్లనూ తన చేతులతో చుట్టివేసింది.

''అలా అనవద్దు ఆంటీ. మా భవిష్యత్తును అభాసు చేయవద్దు. వచ్చి మమ్మల్ని దీవించండి. మీరు రానంటే కుదరదు. నామీద ఒట్టే'' అన్నది కంటి వెంట నీరు కారుస్తూ.

అరుంధతి కాసేపు గింజుకున్నా రాజ్యమూ, చల పతి పట్టు సడలించకపోవడంతో ఆమె కూడా బయలు దేరింది.

''నాకు ఇప్పుడు ఎంతో ధైర్యంగా వున్నది అంకుల్. మీరు తప్ప ఇంకెవ్వరూ ఇలా చేయలేరని నాకు తెలుసు'' అన్నది కృతజ్ఞతాపూర్వక చూపులతో ఆయన ముఖంలోకి చూస్తూ.

ఆ చూపులకు క్షణకాలం జాలివేసింది చలపతికి. మరుక్షణంలోనే రాజశేఖరం రూపం కళ్లముందు కద లగా బిగుసుకుపోయాడు.

''సరేలే...సరేలే. పద...నేను కాదు అంగీరించవ లసింది...మీ నాన్న. ఏం హడావుడి చేస్తాడో అక్కడ!'' అన్నాడు చిరాగ్గా.

''మీ అంగీకారమే నాకు మూడొంతుల ధైర్యాన్ని ఇస్తున్నది. నాకు అది చాలు ముందుకు అడుగులు వేయడానికి'' అన్నది గుండె నిబ్బరంతో రాజ్యం.

ముగ్గురూ గేటు దాటి రోడ్డుమీదకు వచ్చారు.

రాజ్యం ఖాళీ ఆటోను ఆపింది.

''చిక్కడపల్లి వెంకటేశ్వరస్వామి గుడికి!'' అన్నది.

చలపతి ''ముందు అమ్మానాన్నలతో మాట్లాడాలికదా. ఇంటికిపోయి ఎలాగో అలాగా వాళ్లను ఒప్పించి వాళ్లనూ తీసు కువెళ్దాం'' అన్నాడు త్వరత్వరగా.

రాజ్యం ఏదో ఆలోచిస్తున్నట్లుగా ఒక్క క్షణం ఆగింది. తరువాత తలెత్తి చలప తినే చూస్తూ- ''మీరు ఒప్పుకుంటే చాలు అంకుల్. మీరు ఏమీ అనుకోవద్దు. ఈ వివాహం నేను చేసుకోవడంలేదు. మీ అమ్మాయి నిర్మల చేసుకుంటున్నది. నన్ను క్షమించండి అంకుల్'' అంటూ చటుక్కున తల దించుకున్నది. ★

